# బర్సాతీ!

## శ్రీ 'వాణీ కుమార'

రాత్రి ఎనిమిది గంట లవుతుందేమో. సౌధోపరి భాగం గదిలో ఒకణ్ణే పుల్లల కుర్చీలో కూర్చొని యథాలాపంగా 'లైఫ్' మేగజైన్ బొమ్మలు చూస్తున్నాను. వెల్వెట్ మిల్కీ బల్బు తుషార ధవళిమతో వెలుగుతూవుంది. ఆ వెలుగు ఎందుకో చలిస్తూ వున్నట్టు కూడా అనిపిస్తూవుంది. వాస్తవమో భ్రమో వితర్కించే స్థితిలో లేను. ఆ క్షణం ఏదో జరుగబోతూ వుందని లోపల ఏదో చెబుతూవుంది. మనస్సు కూడా అలాంటి దేదో వింత సంఘటనకోసం వేకారుతూ వుంది. ఏమి జరగాలనివుందో మాత్రం చెప్పలేను. కాని ఏదో జరుగుతుందన్న ఆశ, ఆ ఆశ నంటి గుర్రాలవలె పరుగులుతీసే ఊహలు, ఆ ఊహల పల్లకీలో విహారం నన్ను కోర్కెల అంతరిక్షంలోకి తీసుకుపోయాయి. ఎదురుగా రంగు రంగులచిత్రాలు చూస్తున్నానేగాని మనస్సు వేరే రంగుల్ని ఊహిస్తోంది. ఎటు చూస్తున్నానో తెలీదు. కళ్లు తెరిచివుండే కలలు గంటున్నాను. అలా ఎంతసేపు వుండేవాడినో కాని ఓరగా తీసివున్న గది తలుపుదగ్గరగా ఏదో నీడ కదలాడి నన్ను అంతరిక్షంలోనుంచి అంగణంలోకి తీసుకువచ్చింది. దిగ్గున అటు చూచాను. ఆశ్చర్యం! ఆమె! ఎలా వచ్చింది? ఎందు కొచ్చింది? నాకోసమే? ఒంటరిగా వున్న నాకోసం పరాయి స్త్రీ రావడమే! రాకూడదని కాదు, కాని ఇంటి యజమాని చూస్తే ఇంకేమైనా వుందా! ఎంత రభస జరుగుతుంది! అసలు ఈ గది నా కిప్పించిన మధ్యవర్తి పెద్దమనిషితో 'వచ్చే ఆయన మర్యాదస్తుడేనా?' అని అడిగాడుట యజమాని. 'ఓ, నాకంటే మర్యాదస్తుడు' అని ఆయన సమాధానం చెప్పి ఒప్పించాడుట. మరి ఇప్పుడీ దృశ్యం అతగాడు చూస్తే నా సంగతి అలా వుండనిచ్చి, మధ్యవర్తిమనిషిని అబద్ధాలకోరని అంటాడే. ఆయన పరువు నిలబెట్టడ మెలా అబ్బా! శ్రీమతి ఇప్పుడప్పుడే రాదని కూడా వాడితో చెప్పానే. మరి ఈమె ఎవరని నిగ్గదీసి అడిగితే!

నిజంగా ఈ బర్సాతీయే నా పరువూ, మధ్యవర్తి ప్రతిష్ఠా హరించబోతూవుంది. లేకపోతే ఆమె ఎవరు? నే నెవరు? నాకోసం ఆమె రావడమేమిటి! అంతా బర్సాతీ మహిమే.

భారత రాజధానీ నగరంలో బర్సాతీ అనేది ఒక సామాజిక వ్యవస్థగా, ఒక సాంఘికమైన అంతస్తుగా, ఒక సర్వజనీన సంప్రదాయంగా స్థిరపడిపోయిందని చెప్పవచ్చు. జనసమ్మర్దం హెచ్చుగావుండే పేటలలో ఈ బర్సాతీ లుంటాయి. క్రిందిభాగంలో సాధారణంగా ఇంటి యజమాని కాపుర ముంటాడు. భోషాణం లాంటి మొదటి అంతస్తులో ఏ అండర్ సెక్రటరీయో, మరే గెజిటెడ్ ఆఫీసరో సతీమణినీ, పరిమితమైన కుటుంబాన్నీ పెట్టుకొని ముచ్చటగా మూడు గదులలో కాలక్షేపం చేస్తూవుంటాడు. ఆపైన వుండేది మన కథావస్తువు బర్సాతీ. దీనిలో క్రింది మధ్యతరగతి వ్యక్తి సపరివారంగా ఎండ, వాన, చలి మొదలైన కాలానుగుణమైన ఈతిబాధల నన్నిటినీ భరిస్తూ ఈ మహా నగరంలో తానూ పిల్లా మేకాతో కాపురం చేస్తున్నానన్న సంతృప్తిని పొందుతూవుంటాడు. ఇంత పెద్దనగరంలో క్రింది మధ్యతరగతివారికి ఆవాసము, ఆస్కారము, ఆనందము కలిగించేది కూడా ఈ బర్సాతీయే. ఏ అరవై రూపాయలో పారేస్తే క్షణంలో ఈ ఆవాసం లభించి కుటుంబంతో కాపురంచేసే ఆస్కారం కలుగుతుంది. ఇక ఆనందం సంగతంటారా, అదంతా మన పరిశీలనశక్తిపైన, అనంతరం ప్రయోగించే కోణాలపైన ఆధారపడి వుంటుంది. ఓపిగ్గా చూడాలే గాని ఓహ్ లక్ష్య దృశ్యాలు! వీధిలో విలాసినులెలా నడుస్తూ పోతున్నారో, క్రింద యజమాని ఇంట్లో ఆయనగారి అరడజను అమ్మాయిలు ఎలా మెలికలు తిరుగుతూ నడుస్తారో, పక్కింటి ఫస్టుఫ్లోర్‌లో నివసించే యువదంపతులు టేబిల్ మీల్సు తీసుకుంటూ ఎలా సరసాలాడుకుంటారో, ఆవిడ అతన్ని ఎలా కవ్విస్తుందో, అతను ఆవిడచేసే దండయాత్రలను ఎలా తిట్టుకుంటూ వుంటాడో, చివర కొక్క ముద్దుతో ఇద్దరూ ఎలా డిస్పర్సు అవుతారో, వాళ్ళ బర్సాతీలో వుండే కొత్త కాపరపు పిల్ల సాయంత్రం మొగుడి రాకకోసం

ఏ పోజులో నిరీక్షిస్తూ వుంటుందో, దూరంగా మరో బర్సాతీపై వెన్నెలల్లో ఏయే విహారాలు జరుగుతూ వుంటాయో—ఇలా చెప్పుకుపోవాలేగాని సినిమాలలో కంటె శృంగార దృశ్యాలను, రసవత్తరమైన ఘట్టాలను, సజీవమైన సన్నివేశాలను చూచే భాగ్యం ఈ బర్సాతీవల్ల కలుగుతుంది.

మరి ఈ అవకాశాన్నే నేనూ వినియోగించుకున్నాను. గదిలోచేరి పెట్టేబేడా సర్దుకొని కూలీవాడికి డబ్బులిచ్చి పంపి ఎదురుగావున్న బర్సాతీకేసి చూతునుగదా ఆమె కన్పించింది. ఎంతసేపటినుంచి అలా చూస్తూవుందో! ఆమె చూపులు ఆసక్తిపూరితంగా వున్నాయి. ఆ ఆసక్తి ఏమిటో అన్న ఆసక్తి నాకూ కలిగింది. నేనూ ఒకక్షణం రెప్పవాల్చకుండా ఆమెవంక చూచాను. కాని ఏమిటనిమాత్రం చూపులతో అడగలేదు. అందు కామె మొహం అటు తిప్పుకోవడం, నేను చేతులు దులుపుకొని గదిని పరిచయం చేసుకోడానికి లోపలికెళ్ళడంతో ఆ సన్నివేశం ముగిసింది.

ఆ తరువాత ఇద్దరమూ పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకోబొయ్యేవరకూ ఒకరి నొకరం చూచుకోవడం, చూపులతోనే పలకరించుకోవడం. ఎవరం ఏమూడ్‌లో వున్నామో ఊహించుకోవడం పరిపాటి అయిపోయింది. ఎవరీమె? ఏదేశంమనిషి? భాషేమిటి? ఒంటరిగా వుంటూందా? మరెవ్వరైనా వున్నారా? ఏంచేస్తూ వుంటుంది? ఇలాంటి ప్రాపంచిక ప్రశ్నలన్నీ నాకూ కలిగాయి. కాని తెంపరితనంతో వాటిని పక్కకు నెట్టేసి ఎవరైతేమటు కేమి? యువతి, ఫరవాలేదనిపించేవ్యక్తిత్వం, చదువు నాగరికతా వున్నాయనిపించే వాలకం, అన్నిటికీ మించి చూపులు - అర్థవంతమైన చూపుల్ని ప్రసరిస్తోంది. ఇంకేం కావాలనుకున్నాను.

ఒకరోజు ఉదయమే లేచి పేపరువాడు నా పేపరు ఎటు విసిరేడోనని పిట్టగోడలచుట్టూ చూస్తున్నాను. ఆ అన్వేషణలో ఆమె గదికి దగ్గరగావున్న పిట్టగోడను సమీపించాను. అక్కడ పడివున్న నా పేపరుచుట్టను తీసుకొన్నాను. నా చూపులు అప్రయత్నంగా ఆమె గదిప్రక్క స్థలంలోకి చొచ్చుకుపొయ్యాయి. అవతలి పిట్టగోడ నానుకుని కూర్చొని ఆమె తన పేపరులోని సినీమా పేజీ చూస్తోంది. ఇంకేం - ఇంగ్లీషు పేపరు చదువుతోంది! ఆమెపట్ల నాకు మరికొంచెం ఆసక్తి కలిగింది. అలాగే చూస్తూ నిలబడ్డాను - ఆమెవంక కాదు, నా పేపరు హెడ్‌లైన్సును. ఆవిడ తీగెలాగా లేచి పైట సవరించుకుంటూ తెచ్చిపెట్టుకొన్న వయ్యారంతో వెళ్ళిపోయింది. ఈ పైటసవరింపులు మగవాళ్ళపై చాలా అద్భుతంగా పనిచేస్తాయి. ఎదుటపడ్డ యువతి పైట సవరించిందంటే అటు చూడవద్దని అన్నట్టేగాని; నేను—స్త్రీని ఇక్కడున్నాననీ, నన్ను చూచావా అనీ హెచ్చరించినట్టుగా వుంటుంది. ఇలా ఆమె మరింతగా నన్నాకర్షించింది.

అయితే ఆమె కివాళ ఇంత చొరవ కలగడానికి పోయిన ఆదివారంనాటి ఘట్టమే ముఖ్యకారణమనుకుంటాను. ఆ సాయంత్రం నేను ఎక్కడికీ వెళ్ళలేదు. గదిలో వూరికే పడుకొని వొళ్ళంతా బద్ధకమెక్కింది. బైటికి వచ్చి వొళ్ళు విరిచి దిక్కులు చూచాను. ఆమెగదికి వెనుకభాగం కొంచెం మరుగ్గా వుంటుంది—నాకుమాత్రం కాదు. ఆ మరుగే ఆవిడకు ఏకాంతప్రదేశంగా, విహారభూమిగా, శృంగారవనంగా ఉపకరిస్తూ వుంది. ఆ శృంగారవనంలో ఒక తిన్నెమీద కూర్చొని నా గదిమీదుగా అంతరిక్షంలోకి చూస్తూ వుంది. నేనూ ఆమెను పరిశీలనగా చూచాను. నన్ను చూచి తలవంచుకొని చేతిప్రేళ్ళను బొటనవ్రేలితో తడువుకుంటూ ఆలోచనానిమగ్న అయింది. చాలా చిత్రమైన మనిషి. ఎప్పుడు చూచినా ఏదో గుండెను పట్టుకొనేభావం స్ఫురింపజేస్తుంది. అది కొంత అర్థమైనట్లుంటుంది. వివరంగా తెలిసిరాదు. తెలుసుకోమని బుద్ధిని మెలిపెడుతుంది. చివరకు మిగిలేది క్వొశ్చన్ మార్కు! తన్నుగూర్చి తెలుసుకోవలసింది చాలా వుందని చెబుతూ వున్నట్లుంటుంది ఆమె వైఖరి. క్షణంసేపు ఒకతీరుగా చూస్తుంది. ఏదో తన్మయత్వంలో పడుతుంది. పోనీ అలాగే వుంటుందా అంటే మరుక్షణం తెప్పరిల్లుకొని నేను నీయెదుటే వున్నానని తెలియచెబుతుంది. కాసేపు తీక్ష్ణంగా అవలోకిస్తుంది. అంతలో విచారం, ఇంతలో నిట్టూర్పు, కాస్తంత ఆశ, హెచ్చుశాతం నిరాశ. కొంచెంసేపు నిరామయం, చాలాసేపు నిశ్శబ్దం ఆవరించిన నిస్పృహ. ఇవన్నీ ఒకానొక మధురక్షణంలో ఆశ్చర్యకరంగా మబ్బుపింజలవలె చెదరిపోతాయి. సూటిగా ఉద్దేశపూరితంగా చూస్తుంది. ఈ వ్యవహారమంతా ఆమెపట్ల నా ఆసక్తిని ఇనుమడింపజేయడమేగాక ఆమెనుగూర్చి పరిశీలన చేయవలసిందీ, తెలుసుకోవలసిందీ కొంత వుందన్న

నిశ్చయం నాకు కలిగించింది. నేనూ ఆమెను ఆపాదమస్తకం అర్థవంతమైనదృక్కులతో చూడడం మొదలు పెట్టాను. నువ్వు నన్ను చూస్తున్నావు అన్నట్టుగా కళ్ళెత్తి చూచింది. పక్కకెళ్ళి అవతలి పిట్టగోడ కేసి చూచింది. నేను కదలలేదు. ఇటు తిరిగి ధైర్యంచేసి కొంచెం ముందుకు వచ్చింది. దగ్గరగా వచ్చిన ఆమె మూర్తిని పరీక్షగా చూడాలనుకున్నాను. అలాంటి అవకాశం ఆమె ఇవ్వదు. మాలిమి కావాలని చిరునవ్వు మొహం పెట్టాను. ఆమె ఆగింది. క్రింద నేలకేసి చూపులు వాల్చింది. పరవాలేదు. కొంత వీలిచ్చింది. కాని ఆమె సంగతి అంత సులభంగా అర్థం కాదు. ఆమె చూపులు ఏభావ భంగిమలో వున్నాయోనని చూడ ప్రయత్నించాను. లాభంలేదు. చాలా చిన్న కళ్ళు. ఆ నల్లని రెప్పలక్రింద అవి అసలు కన్పించడం లేదు. మనుషులు ఒకరి నొకరు పలకరించుకొని సన్నిహితులు కావచ్చునన్న తెలివి అంతవరకూ నాకు కలుగలేదు. కాని మాట్లాడితే ఏమి చిక్కో — అసలే ఉత్తర దేశం. అందులోనూ శీతోష్ణ వైపరీత్యాలకూ, దుమ్ము తుపానులకూ, పట్టపగలు హత్యలకూ, పరువమూ పౌరుషమూ చేవ తెగువ కల ఆడవాళ్ళకూ పేరుపడ్డ యీ నగరంలో (ఈనగరంలో ముసలమ్మలు సైకిళ్లు తొక్కుతారు. జవరాండ్రు ఒక్కొక్క స్కూటరుపై ఇద్దరు చొప్పున శరవేగంతో పోతారు.) మనుషు లెటువంటివాళ్ళో! అందులోనూ స్త్రీ వ్యవహారం!

అయినా ఈ మనిషి తీరే అంత. మనిషిని చూస్తే ఆలోచించ బుద్ధవుతుంది గాని మాట్లాడబుద్ధెయ్యదు. చూచినకొద్దీ ఏవో ఊహలు, భావనలు, ఏమిటో గజిబిజి. ఏమిటి చెయ్యడం అనుకుంటూ వుండగా అర్థమయ్యేనా అన్నట్టు నన్ను నిలువునా చూచింది. నీపట్ల నాకు ఆసక్తి వుందన్నట్టు నేనూ మొహం పెట్టాను. నువ్వు సహృదయుడివీ, సరసుడివీ, స్నేహపాత్రుడివేకదూ అని అడిగినట్టు నా కళ్ళల్లోకి చూచింది. అంతటి పరీక్ష పనికిరాదన్నట్టు పక్కకు చూపులు తప్పించాను. ఆమె మళ్ళీయథాస్థితికి వచ్చింది. ఆ భంగిమ, మొహంలో ఆ దైన్యం, కళ్లల్లో ఆ నిరాశలు, ముక్కునుంచి ఆ నిట్టూర్పులు, మొత్తం ఆమె పరిసరమే బెంగతో ఆవహించుకుపోయింది. ఇలాంటి విలక్షణమైన మౌనంతోనే ఆమె నన్ను ఆకట్టుకుంది. ఇక చొరవ తీసుకోలేను. ఆమె వాలకంలో ప్రస్ఫుటమైన అసంతృప్తిని చూచి కలతజెందాను. మరొకమారు ఆమెను కలయజూస్తూ వుండగా ఆమె గట్టు ఎక్కలేని నదిలా, వికసించి సోయగం చూపజాలని నిరుపేద పూవులా, ప్రియుణ్ణి ప్రసన్నం చేసుకోలేకపోయిన నాయికలా అర్థంతరంగా నిష్క్రమించింది. అర్థోక్తిలోనే అంతమైన అంకంలా వుంది ఈ మౌననాటకంలోని ఘట్టం.

నాటి ఈ ఘట్టమే మా పరిచయ గాథను ఇవాళ ఇలా పతాకస్థాయికి తెచ్చింది. ఇందుకు స్థల కాల మహిమలుకూడా కొంత దోహదం చేశాయి. ఏమి నగరం! ఎంత సౌందర్యం! బజార్లలో, బస్సులలో, ఆఫీసులలో, థియేటర్లలో ఎక్కడ చూచినా యౌవనం స్వేచ్ఛావిహారం చేస్తూవుంది. కన్నాట్ ప్లేస్‌లో వన్నెల విసనకర్రలు, కుందనపు చుక్కలు, చందనపు బొమ్మలు, అజ్మల్ ఖాన్ రోడ్డు అంగళ్ళచుట్టూ మూగే సౌందర్యరాసులు, ముగ్ధలు, మధ్యలు, ప్రౌఢలు, బిబ్బోకవతులు, భీతహరిణేక్షణలు చంచలాక్షులు, అలినీలాలకలు, వరూథినులు, వర్కింగు గరల్స్, వటీరావులు, చంద్రాస్యలు, చక్రస్తనులు, జఘనసుందరులు, నతనాభులు, నగుమోములు, క్రీగన్నులు, వాలుచూపులు, ఇంద్రధనుస్సులను స్ఫురింపజేసే రంగులు, 'కిస్ ఆఫ్ ఫైర్ పెదవులు', గులాబీ చెక్కిళ్లు, మెరుగులు, దిద్దుళ్లు, సొబగులు, సోయగాలు, నడకలు, నవ్వులు, హావభావాలు, మూడ్సు, మేనర్సు — ఎన్నో భంగిమలలో పురుషుడికి ప్రకృతి సాక్షాత్కరిస్తుంది! పల్లెపట్టులలో చెట్లు పూచి ఋతువు మార్పును తెలియజేస్తాయి. కాని ఇక్కడ స్త్రీల దుస్తులలో వచ్చే మార్పే కొత్త ఋతువును సూచిస్తుంది. చలికాలం ఉలెన్‌కోట్లక్రింద, స్వెట్టర్లక్రింద, శాలువలక్రింద మరుగుపడ్డ సౌందర్యమూ, యౌవనమూ నూత్నకాంతులతో బైటపడి ఎటకో ఎటకో తీసుకుపోతుంది. సాంద్రారణ్యంలోని పుష్పవనాలు బైట పడ్డట్టుగా, ఒక్కమారు రాచనగరు ద్వారాలన్నీ తెరచుకొని అంతఃపురాలలోని జనానా అంతా వెలువడ్డట్టుగా అనిపిస్తుంది. సన్నచీరెలు, నైలాన్లు, షిఫాన్లు, వాయిల్సు, మోడిష్ బ్లౌజులు, కట్ మెడలు, నాటీకమీజులు, జంపర్లు, సెల్వార్లు, వల్లెవాటులు, చమికీలు, నగిషీలు, ఎంబ్రాయిడరీలు, జివ్వునలాగే జూకాలు, మనస్సును మెలికలుపెట్టే రింగులు, ద్విజటలు, త్రిజటలు, చుట్టలు, ముడులు, గుర్రపు తోకలు ఆదిగాగల హెయిర్ స్టయిల్సు, ఎత్తు మడమలు, ఎబ్బరికపు నడకలు, బ్లౌజులపక్క బంగెన

పల్లి బుజాలు, చోళీల దిగువ కొలువతీర్చిన నడుములు, కుచ్చెళ్ళపైని ముడతలు—పూర్తి తుష్టిని కలిగించడమే కాక, వెగటుకూడా గొలిపే సౌందర్యం! అబ్బ, కృత్రిమ సౌందర్యం మానవుణ్ణి ఎలా ప్రలోభపరుస్తుంది! ఈ వాతావరణంలో నాతిగల బ్రహ్మచారి నీతికి కట్టుబడి వుండటమంటే మాటలా? ఏదో సినిమాలో 'ఆమే ఎదురై వచ్చేదాకా పదరా పోదాం పైపైకి' అన్న పాటలా నేనూ ప్రవర్తించి ఏరి కోరి ఇవాళ ఇలా నెత్తిమీదికి తెచ్చుకున్నాను.

ఈ ఆలోచనా పరంపరలో పడి గదిముందుకు వచ్చి నిలబడ్డ ఆమెకు స్వాగతమే చెప్పలేదు. లోపలికి కూడా రమ్మనలేదు. మనిషి ఏదో ఆవేశంలో కొట్టుకు వచ్చినట్టుగా వుంది. నిర్ఘాంతపోయి తెప్పరిల్లి 'మీరా' అన్నాను.

ఆమె చిరునవ్వు తెచ్చుకోవాలని ప్రయత్నించి చివరకు చింత తళుక్కున మెరిసేట్టు చూచింది. సాదా రకం లక్నో తెల్లచీర, మోచేతులవరకు జాకెట్టువేసుకుంది. అలాంటి సాదాదుస్తులకే ఆమె పుట్టిందా అనిపిస్తూవుంది. ఏం మాట్లాడను? ఏమీ తోచక "ఎలా వచ్చారు?" అని అడిగాను.

"రాకూడదా?" అంది.

"కాదు. క్రింద..." వాక్యం పూర్తిచేసి నా పిరికితనాన్ని పూర్తిగా బైటపెట్టుకోవడానికి మనస్సొప్పలేదు. కొంచెం ధైర్యంగా వుండడానికికూడా ప్రయత్నించాను.

"రెండు ఫ్లోర్సులోనూ ఎవరూ లేరు."

అమ్మయ్య. ప్రాణం కుదటపడింది. అప్పుడు జ్ఞాపకంవచ్చింది, ఇంటివాళ్ళు పెళ్ళివిందుకు వెళ్లినట్టూ, ఫస్టుఫ్లోర్ దంపతులు ఇంద్రాణి డ్యాన్సుచూడడానికి వెళ్ళినట్టూ. పరవాలేదు, పరువు దక్కిందనుకున్నాను.

నా స్థితి తెలుసుకుందో ఏమో "మా రూముకు వెళదాం రండి." అందామె.

మళ్ళీ ఇదొకటా! అక్కడమాత్రం రెండు ఫ్లోర్లు లేవూ? అయినా కొంతవరకు నయమే. ఇక్కడే తిష్ఠ వెయ్యాలనే ఉద్దేశంతో రాలేదు. కనుకనే ఎక్కడికి పోతున్నాను అన్నమాట ఆలోచించక, ముందు ఇక్కడినుంచి తరలిపోతే చాలన్న భావంతో "అలాగే పదండి." అన్నాను.

నేను లైట్ స్విచాఫ్ చేయకముందే ఆమె దారి తీసింది. తలుపులు వేసి పిట్టగోడ దగ్గరికి వచ్చి చూస్తే ఆమె వాళ్ళ మెట్లు ఎక్కుతూవుంది. మనిషి నీడలా కదులుతూంది. వెళ్ళాలా వద్దా అన్న సంకోచం కలిగింది. ఆమె అంటే జాలి, సానుభూతి కలుగుతున్నాయిగాని భయం, సందేహం కలుగడంలేదు. సరాసరి వెళ్లేశాను అక్కడికి. గదికి ఒకటే తలుపు. కిటికీలన్నీ మూసివున్నాయి. లైటు మందంగా వెలుగుతోంది. ఆమె వ్యక్తి, ఆమె జీవితం ఎలా వున్నాయో ఆ లైటు కాంతి కూడా అలాగే వుంది. గదిని క్షణం పారచూచి ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూచాను.

'కూర్చోండి.' అంది. ఆ మాటలో గాద్గద్యం స్పష్టమైంది. పెదవులు కంపించాయి. మనిషి బిత్తరపోయింది. ఎంత ఎక్సైట్ అవుతూంది! ఏదో ఉద్రేకంలో పడ్డదా అనిపిస్తూంది.

గదిలోవున్న ఒకే ఒక కుర్చీలో నేను కూర్చున్నాను. ఆమె మంచంమీద కూర్చోబోయి, చప్పున లేచి బైటికి వెళ్ళింది. నడకలో తొట్రుపాటు కన్పిస్తూ వుంది. ఏంచేస్తూ వుందక్కడ? ఏమీలేదు. ఒకమారు అలా మొహం తప్పించి మళ్ళీ లోపలికివచ్చి అలమారాకెదురుగా నిల్చుంది. మాట్లాడదు. కదలదు. ఈ నిశ్చల, నీరవ, నిరీహస్థితిని తొలగించుదామనే ఉద్దేశంతో "మీరూ కూర్చోండి." అన్నాను.

"పరవాలేదు." అంటూ చీర సర్దుకొంది. ఏదో వెర్రి ఆవేశంలో అలా వచ్చిందిగాని మనిషి చొరవ కలదిగాదని స్పష్టమవుతూనే వుంది.

"ఎందుకూ పిలిచారు?" అంటూ అసలు విషయానికి వచ్చాను.

బదులుచెప్పడానికామెకు మాటలు పెగలలేదు. కొంచెం దూరంగా జరిగింది. నా కుర్చీముందున్న టీపాయికేసి చూస్తూవుంది. ఆమె మొహంలోని ఉదాసీనభావాన్ని గమనిస్తూ "చెప్పరూ?" అన్నాను.

"నాకు తెలీదు." అంది మెల్లగా; అని శూన్యంలోకి చూస్తూవుంది.

చిత్రం! ఇంతపనిచేసింది! ఇప్పుడు తనకు తెలీదట!! నేను బిగ్గరగా నవ్వేశాను. ఆ నవ్వులో నా స్వభావాన్ని తెలుసుకోవాలని నన్ను మరీ నిశితంగా చూచింది. ఏమనుకుందో ఏమో, దెబ్బతిన్నట్టుగా మాత్రం కన్పిస్తూవుంది.

"పోనీ కూర్చోండి." అన్నాను ఆమెను కొంత పరుద్దామని.

దగ్గరికి రాదు. పోనీ, అక్కడైనా కూర్చోదు. సంభాషణ అంతకంటె సున్న. పురుషుడికి స్త్రీ అనేది ఎడతెగని సమస్య అన్న తాత్త్వికుల సుభాషితానికి ఈమె ఒక్కొక్క వాలకం ఒక ఉదాహరణలా వుంది. మనిషి అర్థంకాదు. కాకపోతే పోయిందిలే అని విరమించుకోనూ లేను. చివరకు లేవబోయ్యాను. ఆమె గాబరాపడి చూస్తూవుంది. ఉలకదు, పలకదు. "వెడతాను." అన్నాను.

ఆ క్షణం ఆశ్చర్యం, ఆందోళన, అలజడి అన్నీ ఆమె కళ్ళల్లోను, ముక్కులోను కేంద్రీకరింపబడ్డాయి. బుజాలు అదురుతున్నాయి. కళ్ళను మరీ సన్నగా లోతుగా చేసి చూస్తోంది. వెళుతున్నా నన్నట్టుగా ఆమె కళ్ళల్లోకి మరోకమారు చూచాను. బయలుదేరి తలుపుదగ్గరికి వచ్చేసరికి వెనకనుంచి "వెడతారా?" అన్న మాట సన్నగా వినిపించింది.

నేను ఆగి వెనక్కి తిరక్కుండానే "ఎందుకు పిలిచారో మీరు చెప్పనప్పుడు ఎలా వుండను?" అన్నాను.

ఆమె నా వీపుదగ్గిరగా వచ్చింది. ఆవిడ ధైర్యాన్ని మెచ్చుకోవాలనుకున్నాను. ఆ పని చేయలేదు. ఆమె వైపుకు కూడా తిరగలేదు. మీరే చెప్పండన్నట్టు స్థిరంగా నుల్చున్నాను.

"కూర్చోండి."

అబ్బ! ఎంతసేపటికి మనిషికి మాట పెకలింది!

"నేను ఒక్కణ్ణే కూర్చోను." అన్నాను.

"ఇద్దరం కూర్చుందాము." అంది. ఫరవాలేదు, ధైర్యం పుంజుకుంటూవుంది!

"మరి ఎందుకు పిలిచారో చెబుతారు కదూ!"

ఈ ప్రశ్నకు ఈ పర్యాయంకూడా సమాధానం లేదు.

"ఇందుకే వెడుతున్నాను." అన్నాను.

నావీపు వెనకాలే వున్న ఆమె పక్కకు దగ్గిరగా వచ్చింది. ద్వారబంధంపైభాగాన వున్న విద్యుద్దీపం కాంతి ఆమెపై పడుతూవుంది. పాలిపోయిన ఆ ముఖంలో ఏవో కథలూ గాథలూ ప్రక్షిప్తమై వున్నట్లనిపించింది. జారిపోయి పచ్చని నరాలు కన్పిస్తూవున్న ఆమె చెక్కిళ్ళలో ఏవో నిరాశలు, నిట్టూర్పులు రేఖల ఆకారం పొందాయి. శుష్కించిన ఆ పెదవులలో ఏవో విషాద సంఘటనల తాలూకు నీలినీడలు ఆవరించి వున్నాయి. కృశించిన ఆ వక్షస్థలంలో ఏవేవో ఆశలు, వాంఛలు, యౌవనప్రాదుర్భావం అణగిపోయినట్లు ఉన్నాయి. మనిషి నిలువెల్లా తీరని కోర్కెలమూర్తిగా వుంది. ఇప్పుడామెస్థితి నాకు కొంత అర్థమైంది. నిర్లిప్తతతో ఆత్మీయురాలిని చూచినట్లు చూస్తున్నాను. ఇక్కడ ఇంత సౌందర్యంలో ఈమెనా నేను ఆసక్తితో చూచింది. మన నాగరిక సమాజంలో ఇలాంటి సగం వాడిన పువ్వు లెన్నో!

"మీరు చెప్పవలసిందేమీ లేదా?" అని అడిగింది. ఆమె చెప్పవలసిన సమాధానం నాతో చెప్పించాలని చూస్తోంది.

"ఉంటే నేనే వచ్చేవాణ్ణి."

"ఉంది. కాని మీరు రాలేదు." అంది ఉక్రోషంగా. అప్పుడే నా మీదేదో ఈమెకు హక్కు వుందన్నట్టు ఆగ్రహిస్తూంది కూడా.

"పోనీ మీరు వచ్చారుగా. సంగతేమిటో చెప్పండి." అన్నాను తాపీగా.

"లేదు. నేను తొందరపడ్డాను. కాని మీరు చెప్పవలసింది కూడా వుందని నాకు తెలుసు."

"ఎలా?"

"ఇన్ని రోజులనుంచీ మీ చూపులు చెబుతున్నాయి."

"ఏమని?"

"మీ రిప్పుడు వెనక్కి వెడుతున్నారు."

"నే నసలు ముందుకు వచ్చిం దెప్పుడు?"

"మీ అంతరాత్మ నడగండి."

"మీరు తొందరపడ్డారు."

ఈ మాటకు ఆమె ముఖం మరీ కోలగా కుంచించుకుపోయింది. అసలే చిన్న కళ్ళు, ఆ రెప్పలలో మరీ మరుగుపడ్డాయి. చెక్కిళ్ళలో పల్చటి నెత్తురు గడ్డకట్టుకుంది. మొహంపక్కకు తిప్పుకొని, పైటకొంగు ఒంటి చుట్టూ మరీ బిగించి మొహానికి అడ్డం పెట్టుకుంటూ "మరి ఎందుకు చూచారు నన్నలా?" నిగ్గదీసింది.

"ఎలా?"

"మీకే తెలుసు."

"చూచానని తెలుసు. కాని ఒకందుకు చూచాను."

"ఎందుకు?"

"చూడకపోతే మీరు ఏమనుకుంటారోనని."

"అబద్ధాలు. వంచన. ఆత్మవంచన. పరవంచన."

ఆమె మరీ ఆవేశపడుతూవుంది. ఏం జరుగుతుందోనని నేను ఆందోళనపడుతున్నాను. ఏమైనా చెయ్యవచ్చు. వెంటనే ఆమెను ప్రసన్నం చేసుకోవడం అవసరం. కాని కాలు జారేట్టు చేసుకోకూడదు. అందుకు సిద్ధపడే ధైర్యం, త్యాగం లేవు. ఈ నాగరిక సమాజంలో నేనూ పరువుగా బ్రతకాలి. బ్రతుకులో ఒడుదుడుకులు, అపకీర్తి వుండకూడదు. పైకి హుందాగా వుండాలి బ్రతుకు. నలుగురిచేతా మంచివాడి ననిపించుకోవాలి. ఇవన్నీ జరగాలంటే నటన, కప్పిపుచ్చుకోవడం, కోర్కెలనూ, సానుభూతినీ, జాలినీ, మనోదౌర్బల్యాన్నీ, హృదయంకోరే సాంగత్యాన్నీ వదులుకోవాలి. ఆమె సమక్షంలో ఉంది నేనుకాదు? సమాజంలో మర్యాదస్తుడుగా పరిగణింపబడుతూవున్న, వ్యక్తిత్వం లేని వ్యక్తి. చివరకు ధైర్యం చేసి "చూడండీ, మీరూ, నేనూ వుండేది బర్సాతీ గదులని మీకు తెలుసుకదా?" అన్నాను.

ఆమె క్షణంసేపు తనకు జరిగినదాన్ని విస్మరించి ఇంకా ఏమంటానో అని శ్రద్ధాళువై చూస్తూవుంది. ఇప్పుడు నిజంగా ఆమెలో రక్తం ప్రవహిస్తూంది. అందుకు నిదర్శనం ఆమెలో కన్పించే చలనం.

"ఇవి అసలు ఎందుకు కట్టారో తెలుసా?"

"మీరే చెప్పాలి."

"వర్షం వచ్చినప్పుడు బైట పడుకొన్నవాళ్ళు అందులోకెళ్ళి తలదాచుకోవడానికి."

"అయితే?"

"మన పరిచయంకూడా అలాంటిదే."

"అంటే?"

"ఇద్దరమూ ఒంటరిగా వున్నాము - పోనీ యౌవనంలో వున్నాము. ఆ యౌవన చిద్విలాసమే మనం ఒకరినొకరు అలా చూసుకొనేట్టు చేసింది. చూచుకున్నాము. దృశ్యసౌఖ్యం అనుభవించాము. సమ వయస్సులో వున్న స్త్రీ పురుషుల కది సహజం."

"ఎంత బాగా ఉపన్యాసం చెప్పారు. అయితే?"

"వర్షం తుంపరలు ఎక్కువసేపు ఉండవు. కొద్దిసేపట్లోనే తగ్గిపోతాయి. శరీరాలను దాచుకోడానికి లోపలికి వెళ్ళినవాళ్ళందరూ మళ్ళీ బైటికి వస్తారు. మనమూ అంతే. యౌవనం తాలూకు జల్లులు మనల్ని ఇలా పరస్పరం ఆశ్రయించుకొనేట్టు చేశాయి."

"హుం! మనం లోపలికే వెళ్ళలేదు."

"అవును. అంచులలో చూరులక్రింద నుల్చునే జల్లులను తప్పించుకొన్నాము. వెళ్ళకపోవడమే మంచిది."

ఈ మాట అని ఆమె ఏమనుకుంటూందోనని అయినా చూడకుండా చరచరా మెట్లు దిగి వీధిచీకట్లో పడి వెళ్ళాను. ఆరాత్రంతా గదికి చేరుకోలేదు.

* * * *

మరుసటిరోజు ఒక కూలీని తీసుకువచ్చి పెట్టే బేడా అతని నెత్తిన పెట్టి ఆ తావునుంచి నిష్క్రమిస్తూ వుంటే ఆమె ఎదురుగావున్న కిటికీదగ్గిర కుర్చీలో అటు తిరిగి కూర్చొనివుంది. ఆమె వాలకం చూస్తే నే చేస్తున్నదంతా గమనిస్తున్నట్టే వుంది. కాని తిరిగైనా చూడలేదు. బహుశా అలా నాకు వీడ్కోలు చెబుతూందేమో అనుకుంటూ విచిత్రానుభూతులతో ఆ బ్లాకునుంచి మరో బ్లాకుకు వెళ్ళిపొయ్యాను.